

# కలిసుందామా?

- ఎం.తేజావతి

సహ జీవనం...! లివింగ్ టుగెదర్...! నాలాగా సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టినవాడికి రాకూడని ఆలోచన. కానీ ఎందుకో నన్ను అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. ఊరిస్తోంది. ముందుకెళ్లమని తోస్తోంది. ఎటువంటి బంధనాలు లేకుండా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించమని పురికొల్పుతోంది.

అది సముద్రాలుదాటి అవకాశాల భూమిగా పేరుగాంచిన అమెరికాలో ఉన్నత చదువులు చదువుకోవడానికి వచ్చిన నాకు మన రాష్ట్రంనుండే వచ్చిన సంజన అనే అమ్మాయితో పరిచయం అయినప్పటి నుండి మనసంతా నులివెచ్చని ఎండలో ఉన్న భావనతో నిండిపోయింది. ఎటువంటి అమరికలు లేకుండా సంజన మాట్లాడే తీరు, ఏ ఆర్ రెహమాన్ రింగ్‌టోన్‌లా ఉండే ఆమె నవ్వు, ఎప్పుడూ నవ్వుతున్నట్లుగా ఉండే ఆమె కళ్లు నిరంతరం ఆమెకోసం ఆలోచించేలా చేసాయి. ఇద్దరం ఒకే క్లాసు కావడంతో వీకెండ్స్‌లో తప్ప కలవని రోజంటూ ఉండదు. సంజన తన అంకుల్ వాళ్లింట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటోంది. అయితే సంజన అంకుల్ వాళ్లు ఇప్పుడు శాశ్వతంగా అమెరికా వదిలి ఇండియా వెళ్లిపోవాలని నిర్ణయించుకోవడంతో సంజన కూడా మాలాగ సర్వీస్ అపార్ట్‌మెంట్లలో ఉండటానికి సిద్ధమైంది. మేమిద్దరం కలిసి ఉండాలని నా మనసులో ఉన్నా, మొదటగా బయటపడింది మాత్రం సంజనే. ''నామీద నీకు అంత నమ్మకమేమిటి?'' అన్న నా ప్రశ్నకు పెద్దగా నవ్వుతూ ''నామీద నాకు నమ్మకముందిలే'' అంది.

అప్పటినుండి మేమిద్దరం కలిసి ఉండటానికి అనువుగా ఉండే ఇంటి గురించి వెతకడం మొదలెట్టాను. సంజన చెప్పిన స్పెసిఫికేషన్‌ల ప్రకారం న్యూయార్క్ మహానగరంలో అద్దె ఇంటికోసం నా అన్వేషణ ప్రారంభించాను. ''ఇంటి ముందు పచ్చటి లాన్ ఉండాలని, దగ్గరలో వాకింగ్‌కి పార్క్ ఉండాలని, లైబ్రరీకి దగ్గరగా ఉండాలని, వీలైతే ఇండియన్ రెస్టారెంట్‌కి దగ్గరగా ఉండాలని... ఇలా చాలా షరతులే పెట్టింది. అద్దె ఎక్కువయినా పరవాలేదు గానీ ప్రస్తుతం నేనుంటున్న గాలి, వెలుతురు రాని ఇరుకు అపార్ట్‌మెంటు లాంటిది మాత్రం వద్దని ఖచ్చితంగా చెప్పేసింది. అప్పటికి గాని సంజన సౌండ్ పార్టీ అన్న విషయం అర్థంకాలేదు నాకు. ఇన్ని కండిషన్లతో న్యూయార్క్ నగరంలో ఇల్లు దొరకడం కష్టమే అయింది. అయితే ఓ స్నేహితుడి తోడ్పాటుతో నగరానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్ ఐలాండ్ అనే ప్రాంతంలో, ఇంటిముందు పచ్చటి లాన్ లేకపోయినా మాపుల్ చెట్లతో (ఈ చెట్ల ఆకే కెనడా దేశం జాతీయ చిహ్నం) నిండిన పార్క్ ఎదురుగా ఇల్లు దొరికింది.

ఓ వీకెండ్ సంజనని తోడ్కొని ఇల్లు చూపించాను. 'ఇంత అందమైన ఇంట్లో ఉంటున్నామన్న ఆలోచనే నన్ను ఎంత ఆనందానికి, ఉద్వేగానికి గురిచేస్తోందో నీకు తెలుసా' అంది సంజన చిన్న పిల్లలా గంతులేస్తూ.

నాకు అంతకన్నా ఉత్సాహంగా ఉంది. రోజూ ఉదయాన్నే కురుస్తున్న మంచుని చూస్తూ కలిసి కాఫీ తాగొచ్చని, రాలిన రంగురంగుల మాపుల్ ఆకుల మీద చప్పుడు చేసుకుంటూ నడవొచ్చని, వర్షంలో ఒకే గొడుగు కింద నడిచి వెళ్లొచ్చని, యూనివర్శిటీకి థియేటర్‌కి షాపింగ్‌కి కలిసి వెళ్లొచ్చని, నా వంట రుచి సంజనకి చూపించొచ్చని, నా ముందే కలహంసలా కదిలే సంజనని కళ్లార్పకుండా చూడొచ్చని, ఒక్క మాటలో చెప్పాలంటే ఇద్దరం ఒకే కప్పుకింద కలిసి ఉండటమన్న ఊహే నాలో అణువణువుని నాట్యం చేయిస్తోంది.

అసలు ఇద్దరికీ ఇంతకుముందు పరిచయం లేదు. యూఎస్ వచ్చిన తరువాతే పరిచయం. ఇద్దరం మొబైల్ కంప్యూటర్‌లో ఎమ్మెస్ సిటీ ఆఫ్ న్యూయార్క్ యూనివర్శిటీలో చెయ్యడానికి వచ్చి కలుసుకోవడం ఇన్సిడెంటల్‌గా జరిగితే, ఇద్దరికీ ఒకే ప్రొఫెసర్‌ని మెంటర్‌గా యూనివర్శిటీ ఎలాట్ చెయ్యడం కోఇన్సిడెన్స్‌గా చెప్పుకోవచ్చు. పెద్దగా కలిసిన అభిరుచులూ లేవు. నేను పక్కా శాఖాహారినైతే, సంజన మాంసాహారి. నేను అమీర్‌ఖాన్‌ని అభిమానిస్తే తనింకా అమితాబ్‌ని పిచ్చిగా అభిమానిస్తుంది. నాకు పుస్తకాలు చదవడం హాబీ అయితే, తనకి ప్రకృతి ఆరాధన ఇష్టమైన హాబీ.

నాకు తెలిసి మొబైల్ కంప్యూటర్‌లో నేను ఎమ్మెస్ చేసిన తరువాత డాక్టరేట్ పూర్తిచేసి ఓ సైంటిస్ట్‌గా కెరీర్‌ని మలుచుకోవాలన్న నా జీవితాశయమే ఆమెని ఇంప్రెస్ చేసిందనుకుంటున్నాను. నాకు చదువులో చిన్నప్పటి నుండి వచ్చిన మంచి మార్కులు, ఐఐటి చెన్నైలో నా ఇంజనీరింగ్ చదువు, జీఆర్ఇ పరీక్షలో నాకొచ్చిన స్కోరు, సిటీ ఆఫ్ న్యూయార్క్ యూనివర్శిటీ నాకు ప్రదానం చేసిన స్కాలర్‌షిప్ సంజన దృష్టిలో నన్నొక హీరోలా ఎస్టాబ్లిష్ చేసాయని చెప్పొచ్చు.

సంజన అందం, గలగలా మాట్లాడగలిగే ఆమె వాక్చాతుర్యం, ఆరోగ్యం మీద శరీరాకృతి మీద ఓ ఫిల్మ్ స్టార్‌లా ఆమె తీసుకునే శ్రద్ధ, తనని తాను మరచిపోయి ప్రకృతిని ఆరాధించే ఆమె తీరు, ఎదుటివారి హోదాతో సంబంధం లేకుండా వారిని గౌరవించే ఆమె వినమ్రత... ఇవన్నీ ఆమెపై తెలియని ఆరాధనా భావాన్ని నాలో కలిగించాయి.

* * *

ఇదంతా ఇలా ఉంచితే నేను ఒక అమ్మాయితో కలిసి ఒకే ఇంటిలో ఉండబోతున్నానన్న విషయం చెబితే ఇండియాలో ఉన్న అమ్మానాన్నలు ఎలా స్పందిస్తారు అన్న విషయాన్ని కలలో కూడా ఊహించడానికి సాహసించలేకపోతున్నాను. అమెరికాలో స్కాలర్‌షిప్‌తో సీటొచ్చింది అన్న వార్తే నాన్నలో కాని అమ్మలో కాని ఎటువంటి సంతోషాన్ని నింపలేకపోయింది.

కారణం నేను ఎక్కడ అప్రాచ్యపు వెధవలా మారిపోతానన్న బెంగ ఒక కారణం కాగా, భారతదేశంలో ఒక మనిషి అత్యున్నత స్థాయికి ఎదగడానికి కావలసిన అన్ని వనరులు అవకాశాలు ఉన్నాయన్నది నాన్నగారికున్న ప్రగాఢ నమ్మకం రెండో కారణంగా చెప్పుకోవచ్చు.

ఈ రెండు కారణాలకు తోడు నేను ఒక్కడినే మగ సంతానం కావడం మరో ముఖ్యమైన కారణం. నాకు తోబుట్టువైన అక్కకి పెళ్లయి, బావగారి ఉద్యోగరీత్యా భోపాల్‌లో ఉంటోంది.

జీవిత చరమాంకంలో ఉన్న నా తల్లిదండ్రులకు ఆశ, శ్వాస, భరోసా నేనే. లివింగ్ టుగెదర్, సహజీవనం, డేటింగ్ లాంటి ఆధునిక జీవన విధానాల గురించి నా ద్వారా తెలుసుకోవడం ఏ విధంగానూ వారి ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదనిపించింది. దీనితో నేను ఎప్పటిలాగే వారితో ఫోన్‌లో వారానికి రెండుసార్లు, టివిలో వాతావరణం గురించి చెప్పే ఏంకర్‌లా నా రొటీన్ జీవితాన్ని రిపోర్ట్‌చెయ్యడం కొనసాగించాలని నిర్ణయించుకున్నాను.

ఇక సంజన మేమిద్దరం కలిసే ఉంటామని తన అంకుల్ వాళ్లకి చెప్పేసింది. సంజన అంకుల్ వాళ్లు ముప్ఫై ఏళ్లుగా అమెరికాలో ఉంటున్నారు. భారతదేశపు సంస్కృతీ సాంప్రదాయాలకన్నా అమెరికా ఫాస్ట్ కల్చర్‌ను బాగా ఆకళింపు చేసుకున్నవారు కావడంతో వారు ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. పైగా వారికి నేను పరిచయం ఉన్నవాడిని కావడంతోపాటు, మా ఇద్దరికీ మంచేదో చెడేదో తెలుసునన్న నమ్మకం ఉంది. అయితే ఇండియాలో ఉంటున్న తన తల్లిదండ్రులతో తాను ఓ అబ్బాయితో కలిసి ఉంటున్నానన్న విషయాన్ని చెప్పొద్దని మాట తీసుకుంది సంజన.

కొత్త అద్దె ఇంటిలోకి మారడానికి మంచిరోజు చూసి చెప్పమని నాన్నగారికి ఫోన్ చేసినప్పుడు చెప్పాను. నా నక్షత్రం, రాశి బట్టి వచ్చే నెల మూడో తారీఖు అన్నిరకాలా మంచిదని చెప్పారు నాన్నగారు. అంటే ఇంకా నాలుగురోజుల సమయం ఉంది. నాన్నగారికి శుభ ఘడియలు, మంచి రోజులు, శకునాలు, వర్జ్యాలు మొదలైన వాటిమీద నమ్మకం ఎక్కువ. నన్ను ఉయ్యాలలో వెయ్యడం దగ్గరనుండి, నా అక్షరాభ్యాసం, ఉపనయనం, ఐఐటీకి అప్లికేషన్ పెట్టిన రోజు... ఇవన్నీ నాన్నగారు జాగ్రత్తగా నా జాతకానికి సరిపోతుందో లేదో చూసి నిర్ణయించినవే. నేను ఇల్లు మారేందుకు మంచి రోజు చెబుతూనే మరో మంచి వార్త చెప్పారు నాన్నగారు. మా చిన్నాన్నగారి అమ్మాయైన లాస్యకి కూడా సిటీ ఆఫ్ న్యూయార్క్ యూనివర్శిటీలో సీటు వచ్చిందని, వీసా మంజూరయ్యిందని, నెల రోజుల్లో అమెరికా రానుందని చెప్పారు.

లాస్య నాన్నగారు మా నాన్నగారికి సొంత తమ్ముడు. ఆయన డిఫెన్స్ ఎకౌంట్స్‌లో సీనియర్ ఎకౌంటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగరీత్యా ఉత్తర భారతదేశంలోనే ఎక్కువగా పనిచేసారు. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్నారు. నేను లాస్య కలిసింది వేసవి సెలవుల్లో తను హైదరాబాద్ వచ్చినప్పుడు, లేదా మా ఇండ్లలో కాని బంధువుల ఇండ్లలో కాని ఏవైనా శుభకార్యాలు జరిగిన సందర్భాలలోనే. లాస్యకి కూడా నాలానే యుఎస్‌లో ఎమ్మెస్ చెయ్యాలన్నది జీవితాశయం.

జిఆర్ఇకి ఎలా ప్రిపేరవ్వాలో, పాస్‌పోర్ట్‌కి ఎలా అప్లై చెయ్యాలో, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్ డెవలప్ చేసుకోవడానికి ఎలాంటి పుస్తకాలు చదవాలో నన్ను అడిగి తెలుసుకునేది లాస్య.

అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను, శాస్త్రవేత్తగా జీవితంలో స్థిరపడాలన్న నా జీవితాశయాన్ని అచ్చం నాలాగే అర్థంచేసుకున్న మరో వ్యక్తి ఎవరన్నా ఉన్నారా అంటే అది లాస్యేనని చెప్పగలను. అటు స్నేహితుల్లో గాని ఇటు నా తల్లిదండ్రులు గాని నా ఆశయాన్ని సరిగ్గా అర్థంచేసుకోలేదు. హాయిగా ఓ మల్టీ నేషనల్



శాస్త్రవేత్తగా జీవితంలో స్థిర పడాలన్న నా జీవితాశయాన్ని అచ్చం నాలాగే అర్థంచేసుకున్న మరో వ్యక్తి ఎవరన్నా ఉన్నారా అంటే అది లాస్యేనని చెప్పగలను. అటు స్నేహితుల్లో గాని ఇటు నా తల్లిదండ్రులు గాని నా ఆశయాన్ని సరిగ్గా అర్థంచేసుకోలేదు.

కంపెనీలో మంచి జీతానికి ఉద్యోగంలో చేరకుండా, జీవితాంతం మెదడుని మదిస్తూ తల వేడెక్కించుకోవడం ఎందుకన్నది వారభిప్రాయం.

❋ ❋ ❋

నాన్నగారు చెప్పిన మంచి రోజుకే నేను సంజన శాస్త్రోక్తంగా పాలు పొంగించి కొత్త అద్దె ఇంటిలో చేరిపోయాం. భిన్న ధ్రువాలు పరస్పరం ఆకర్షించుకుంటాయన్న సిద్ధాంతాన్ని బాగా ఎరిగిన వాళ్లం కాబట్టి మాకంటూ కొన్ని కట్టుబాట్లు పెట్టుకున్నాం. కలిసి వంట చెయ్యడం, చదువుకోవడం, మార్నింగ్ వాక్‌కి వెళ్లడం, యూనివర్శిటీకి వెళ్లడం, వీకెండ్స్‌లో టూరిజం ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలకు వెళ్లడం... ఇలా ప్రతి రోజు, ప్రతి నిమిషం, ప్రతి క్షణం ఓ మధురానుభూతిలా, ఓ మైలురాయిలా, ఓ తీపి గుర్తులా గడిపాం. ఇద్దరం ప్రతి క్షణం కొత్తగా అనిపించే ఓ ప్రవాహపు జడిలో కొట్టుకుపోయేవాళ్లం. జీవితం మొత్తం ఇలాగే ఉంటుందన్న ఓ భ్రమకూడా మమ్మల్ని ఆవహించేసింది. రెండు స్కై స్క్రేపర్‌లను అనుసంధానిస్తూ ఇంద్రధనుస్సుని చూడగలిగామన్నా, ప్రేమ పెళ్ళి జీవితాల గురించి విసుగులేకుండా ఓ రోజంతా చర్చించుకున్నామన్నా, శీతాకాలంలో కూడా వసంత మాసపు వాతావరణాన్ని చవిచూడగలిగామన్నా, మా ప్రతి కదలిక కూచిపూడి నృత్యంలా అనిపించిందన్నా...అది మా సహజీవన సాంగత్యపు మహిమగానే చెప్పుకోవచ్చు.

❋ ❋ ❋


లాస్యని రిసీవ్ చేసుకోవడానికి నేను సంజన కలిసి న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకి వెళ్లాం. ప్యాంట్‌లు, షర్టులు, స్కర్టుల మధ్య పంజాబీ డ్రెస్‌తో ఎయిర్‌పోర్టు లాంజ్‌లోకి వచ్చిన లాస్య మా కళ్లకే గమ్మత్తుగా అపురూపంగా అనిపించింది. లాస్యని చూడగానే భారతదేశాన్ని ఎంతగానో మిస్ అవుతున్న భావన కలిగింది నాలో. తనని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన వివేక్ అనే తెలుగు అబ్బాయిని నాకు సంజనకి ఎయిర్ పోర్టు లాంజ్‌లోనే పరిచయం చేసింది లాస్య. వివేక్ ఇండియాలో ఇంజనీరింగ్ చదువుకుంటున్నపుడు తనకు ఒక సంవత్సరం సీనియర్ అని, ప్రస్తుతం న్యూయార్క్‌లో కంప్యూటర్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడని ఇంటికి వస్తున్నపుడు దారిలో చెప్పింది లాస్య.


నేను సంజన కలిసి ఉంటున్నామన్న సంగతి లాస్యకి నేను ప్రత్యేకంగా చెప్పదలుచుకోలేదు. లాస్య కూడా ఆశ్చర్యంతో కళ్లు విప్పార్చి మేము ఇద్దరం కలిసి ఉండటాన్ని పరిగణించలేదు. అంతకు మించి లాస్య సంజన ఎన్నో ఏళ్లబట్టి పరిచయమున్న స్నేహితుల్లా కలిసిపోయారు. ఒకరి గురించి మరొకరు ఆసక్తిగా తెలుసుకోవడానికి ఉత్సుకత చూపించడం నా దృష్టిలో పడకపోలేదు.

లాస్యకు సీటువచ్చింది కూడా సిటీ ఆఫ్ న్యూయార్క్ యూనివర్శిటీయే కావడంతో మా ఇద్దరితో లాస్య కూడా బయల్దేరేది. తను జాయినయిన రోబోటిక్స్ డిపార్ట్‌మెంటులో తెలిసిన ఇండియన్ ప్రొఫెసర్ ఉంటే లాస్యకి పరిచయం చేసాను. మా ఇంటికొచ్చిన అపురూపమైన అతిథిగా లాస్యని నేను సంజన చూసుకునేవాళ్లం. అమెరికాలో రీతి రివాజుల గురించి, ఆచార వ్యవహారాల గురించి, సంస్కృతీ సాంప్రదాయాల గురించి పోటీపడి నేను సంజన లాస్యకు చెప్పేవాళ్లం.

వచ్చే వీకెండ్‌కి తన స్నేహితుడు వివేక్‌ని డిన్నర్‌కి పిలుస్తానని లాస్య అంటే, 'నిరభ్యంతరంగా'అని నేను సంజన గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాం. పాక శాస్త్రంలో

(మిగతా 27వ పేజీలో)





**(19వ పేజీ తరువాయి)**

మాకున్న ప్రావీణ్యాన్నంతా ఉపయోగించి ఇండియన్, మెక్సికన్, ఇటాలియన్, చైనీస్ వంటల్ని తలో రకం వండి వడ్డించాం. మా ఇంటికి వచ్చిన దగ్గర నుండి మొహమాటంగా ఉన్న వివేక్, పెద్దగా ఏమీ మాట్లాడలేదు. హడావిడంతా లాస్య సంజనలదే. వెళ్లే ముందు తన పెన్‌డ్రైవ్‌లో ఉన్న ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ కలెక్షన్‌ని నా సిస్టమ్‌లో లోడ్ చేసాడు వివేక్. భీమ్‌సేన్ జోషి, బిస్మిల్లాఖాన్, పండిట్ రవిశంకర్, జాకీర్ హుస్సేన్, హరిప్రసాద్ చౌరాసియా, శివకుమార్ శర్మ సంగీతంలో చేసిన వివిధ ప్రయోగాలు ఆ కలెక్షన్‌లో ఉన్నాయి.

వివేక్‌కి గుడ్‌నైట్ చెప్పి, పడుకోవడానికి ఉపక్రమిస్తుండగా "రేపు నేను వివేక్ అపార్ట్‌మెంట్‌కి షిఫ్ట్ అయిపోతాను. మేమిద్దరం కలిసుండాలని, నేను అమెరికా రాక ముందునుండే అనుకుంటున్నాం. ఇప్పుడే నా లగేజ్ అంతా సర్దుకుంటాను, మీరు పడుకోండి" అన్న లాస్య మాటలకు నెత్తిన పిడుగు పడ్డవాడిలా నిర్ఘాంతపోయాను నేను. సంజనలో పెద్ద ప్రతిస్పందన ఏమీ కనిపించలేదు. ఉదయంనుండి డిన్నర్ ఏర్పాట్లకోసం పడ్డ శ్రమే సంజన మొహంలో కనిపిస్తోంది కానీ, లాస్య మాటలు ఆమెమీద ఎటువంటి ప్రభావం చూపినట్లు కనపడలేదు. నాకు ఎలా ప్రతిస్పందించాలో అర్థంకాలేదు. ఏమీ మాట్లాడలేనంతగా షాక్‌లో ఉన్నాను. మౌనంగా నా రీడింగ్ టేబుల్ దగ్గరకి వెళ్ళి నిస్సత్తువగా కంప్యూటర్ ముందు కూలబడ్డాను. హరిప్రసాద్ చౌరాసియా నదిమీద చేసిన కాన్సెప్ట్ ఆల్బమ్‌ని ప్లే చేసాను. ఉరకలేసే నది, గలగల ప్రవహించే నది, ఉప్పొంగి ప్రవహించే నది, మౌనంగా ప్రవహించే నది... ఇలా నదియొక్క ప్రతి ఉద్వేగాన్ని తన వేణువు మీద అద్భుతంగా సంగీతం రూపంలో పునఃసృష్టించాడు హరిప్రసాద్. కానీ నాలో ఉప్పొంగుతున్న సంక్షోభాల నదికి, ప్రశ్నల నదికి, సంఘర్షణల నదికి, ద్వైదీభావాల నదికి ఎలా ఆనకట్ట వెయ్యాలో, ఎలా జవాబు చెప్పాలో, ఎలా దారి మళ్లించాలో, ఎలా ఒడ్డుకి చేర్చాలో మాత్రం అర్థంకావడంలేదు. నన్ను ఒంటరివాడిని చేసి లాస్య సంజన గాఢమైన నిద్రలోకి జారుకున్నారు.

లాస్య చెప్పిన మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి. వివేక్‌తో లాస్య కలిసి ఉండటం అన్న ఆలోచనే జీర్ణించుకోలేకపోతున్నాను. నా ఊహే నిజమైతే వారిద్దరూ ఒకరినొకరు ఇండియాలో ఇంజనీరింగ్ చదువుతున్నప్పటి నుండి ప్రేమించుకుంటున్నారు. వివేక్ ఇక్కడ న్యూయార్క్‌లో పనిచేస్తున్నాడనే లాస్య సిటీ ఆఫ్ న్యూయార్క్ యూనివర్శిటీని చూజ్ చేసుకుందనిపించింది. అసలు లాస్యకి వచ్చిన జిఆర్ఇ స్కోరుకి హార్వర్డులో కూడా సీటొస్తుంది. ప్రేమప్రేమలో ఉన్నవారి నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థమైంది.

లాస్య సోదరుడిగా ఆమె తీసుకున్న నిర్ణయాన్ని ఒక్క శాతం కూడా ఆమోదించలేకపోతున్నాను. కానీ నేను, సంజన కలిసి ఉంటున్నామన్న విషయాన్ని లాస్య ప్రశ్నిస్తే కన్విన్సింగ్‌గా చెప్పగలిగే సమాధానం కూడా నా దగ్గర లేదు. అందువల్లనే నువ్వు వివేక్‌తో కలిసి ఉండటం నాకు ఏమాత్రం ఇష్టం లేదు అన్న విషయాన్ని బయటకి చెప్పలేకపోయాను.

నాలో ఆలోచనలు ఆగడంలేదు. వరద గోదారిలో నీళ్లలా అంతు దరిలేకుండా వస్తున్నాయి. ఒక సోదరుడిగా నేను ఒప్పుకోలేనిది, ఒక వ్యక్తిగా నేను లివింగ్ టుగెదర్ అన్న కాన్సెప్ట్‌కి ఎంతగా ఎక్సైట్ అయ్యానో మదిలో మెదిలింది. సమాజం అందరికీ వర్తించేటట్లు, ఉమ్మడిగా కొన్ని కట్టుబాట్లను, సంప్రదాయాలను, విలువలను నిర్దేశించింది. ఆధునికత, అభివృద్ధి ముసుగులో అమెరికాలాంటి దేశాల్లో డేటింగ్, లివింగ్ టుగెదర్ లాంటి కాన్సెప్ట్‌లు పుట్టుకొచ్చాయి. శరీరం క్షణికావసరాలు తీర్చే పనిముట్లుగానే వాటిని నూటికి తొంభై తొమ్మిది మంది వాడుకున్నారు కాబట్టే భగ్న ప్రేమికులు పెరిగిపోయారు, విడాకులు పెరిగిపోయాయి, తల్లిదండ్రులుండి కూడా పిల్లలు అనాథలుగా బ్రతకాల్సి వస్తోందనిపించింది. ఇండియాలాంటి ప్రాచ్యదేశాల్లో కూడా అత్యాధునికులుగా చెప్పుకునేవారు ఈ లివింగ్ టుగెదర్, డేటింగ్‌లకు తెర తీసారు. ఇండియాలో నాలాంటి యువకులకి అది అందని ద్రాక్షే. అదే యుఎస్‌లో అయితే లివింగ్ టుగెదర్ కలని నిజం చేసుకోవడం నాలాంటి వాడికి కూడా చాలా సుళువు.

నా అంతరాంతరాళాల్లో ఎక్కడో అట్టడుగు పొరల్లో శిథిలం కాబట్టనా మాతృదేశపు సంస్కృతి సాంప్రదాయాలు సునామిలా ఎగసి ఉపరితలంలోకి వచ్చాయి. నా కింకర్తవ్యం ఏమిటని ప్రశ్నించాయి. ఈ రాత్రికి నేను 'లివింగ్ టుగెదర్'మీద నా అంతరాత్మలో జరిగే రిఫరెండమ్‌లో 'అవును' లేదా 'కాదు' అని ఖచ్చితమైన సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నం అయిందనిపించింది. ఒక ఇండివిడ్యుయల్‌గా నేను ఎంతగానో ఇష్టపడి అమలుచేస్తున్న జీవన విధానాన్ని నా సోదరి కూడా అనుసరిస్తుందంటే నేను ఎంతమాత్రం ఒప్పుకోవడానికి సంసిద్ధం కాకపోవడాన్ని నా అంతరాత్మ పదే పదే గుర్తుచేస్తోంది. నా ఆలోచనా సరళిలోనే లోపం ఉందని చెబుతోంది.

లివింగ్ టుగెదర్ జీవన విధానాన్ని కానీ, సంప్రదాయబద్ధంగా చేసుకునే వివాహం మరియు తదనంతర జీవితాన్ని గానీ ఎనలైజ్ చెయ్యగలిగేంత మానసిక సంసిద్ధత నేనిప్పుడున్న పరిస్థితుల్లో అసంభవం అనిపించింది. నేను అనుసరించే జీవన విధానాన్ని లాస్య అనుసరిస్తుందంటే నేను ఒప్పుకోలేకపోతున్నానంటే ఖచ్చితంగా నా ఆలోచనల్లో డబుల్ స్టాండర్డ్స్ ఉన్నట్లే అనిపించింది. నేను అనుసరిస్తున్న జీవన విధానాన్ని నా మాతృదేశంలో తల్లిదండ్రులతోపాటు, సాటి సమాజంలోని వ్యక్తులు కూడా హర్షించరు.

ఎందుకో అమ్మానాన్న, లాస్య అమ్మానాన్న, సంజన పేరెంట్స్ గుర్తొచ్చారు. వాళ్లు పుట్టిపెరిగిన సంస్కృతి సంప్రదాయాలు మదిలో మెదిలాయి. వాళ్లు పిల్లల మీద పెట్టుకున్న ఆశలూ గుర్తొచ్చాయి. జీవితంలో మొట్టమొదటిసారిగా నామీద నాకే అసహ్యం కలిగింది. కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని నామీదే అన్ని ఆశలూ పెట్టుకున్న నా తల్లిదండ్రులు నామీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేసాననిపించింది. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేసాను. రేపటి నుండి సంజన లాస్య ఈ ఇంటిలో ఉంటారని, నేను మళ్లీ నా పాత అపార్ట్‌మెంటుకి వెళ్లిపోవాలని. ఈ నిర్ణయాన్ని లాస్య ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా రేపటినుండి నావరకు నేను నా పాత అపార్ట్‌మెంటుకి వెళ్లిపోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. పెద్దవాళ్లను ఒప్పించే సంజనను పెళ్ళిచేసుకోవాలనీ అనుకున్నాను. ఈ నిర్ణయం తీసుకోగానే మనసంతా తేలికయిపోయింది. రీడింగ్ టేబుల్ మీదే తలవాల్చి గాఢ నిద్రలోకి జారుకున్నాను. హరిప్రసాద్ వేణుగానం కొనసాగుతూనే ఉంది. ★


రచయిత్రి చిరునామా:
ఎం.తేజావతి,
వైఫాఫ్ శ్రీనివాసరావు,
ఎస్ఎంఇసిసిసి,
ఎస్‌బిఐ బిల్డింగ్,
ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్,
విశాఖపట్నం- 530 001.